70

## మిలమిల మెరిసే గాజుల గలగల

"చేతులకు తొడవుదానము" అన్నాడో కవి. అతనలా అన్నాడని, చేతులకు దానం మాత్రమే మిగిల్చి, ఏ అలంకారాలూ లేకుండా మనం చేసుకోవడం లేదు.

ప్రఖ్యాత వంగపరిశోధకుడు శరదించు బెనర్జీగారి అంచనా ప్రకారం మానవోదయ కాలం నుండి, ఆహారాన్వేషణతో బాటుగా అందచందాల కోసం కూడా అన్వేషణ ప్రారంభమయింది. సంచార దశ నుండి, మానవుడు సంఘజీవిగా మనడం నేర్చుకొన్న నాటి చిత్రాలను, గుహ చిత్రాలనుచూసిన మనకీ విషయం స్పష్టమవుతుంది. అనాది మానవులు, కొండ గుహల్లోనూ, రాతి పలకల మీద చిత్రించిన బొమ్మలను చూస్తే, ఆ చిత్రాలలోని స్త్రీల ముంజేతులకు, కంకణాలుండడాన్ని మనం గమనించగలం.

ఒకప్పుడు మట్టితోనో, ఎముకలతోనూ, ఆ తరువాత లోహాలతోనూ తయారించిన కంకణాలను స్త్రీలు ధరించేవారు. రాళ్ళను ఆయుధాలుగా వాడిన దశలో, ఆ రాళ్ళతోనే ఆభరణాలను కూడా రూపొందించుకొన్నారు. రకరకాల లోహాలతో ఆభరణాలను ధరించడం, ఎప్పుడూ గౌరవ చిహ్నంగానే ఉండేది. కంకణాలను ధరించడం, అచ్చంగా ఆడవారి హక్కేకాదు. మొన్న మొన్నటి దాకా మగవారు కూడా ఈ కంకణాలను వేసుకునేవారు.

దండకడియం, మురుగులు, సింహతలాటం, రత్నకంకణం లాంటివి ఈ కోవకు చెందినవే.

భిక్షపతికి ఈ సంగతులన్నీ తెలుసునో లేదో మనకు తెలీదు. అతని వంశం వారు మాత్రం తరతరాలుగా ఈ గాజులు తయారు చేయడంలో నైపుణ్యాన్ని సంపాదించారు.

భిక్షపతి తాతగారిపేరు కూడా భిక్షపతిగారే! ఆయనకు ఆ రోజుల్లోని, రాజులతోనూ, నవాబులతోనూ దగ్గర సంబంధాలుండేవి. ఆయా ప్రభువుల 'అంతఃపురాంగన'లకు కావలసిన రకరకాల గాజులను, ఆ భిక్షపతిగారు తయారు చేస్తూ ఉండేవారట.

"నేను మా తాతను చూడలేదండి! మా అయ్య చెబుతూ ఉంటే విన్నా. సంస్థానం ఏ మారుమూలనున్నా, సాబ్‌లందరూ హైదరాబాదులోనే ఉండేవారు. మా తాతగారికేమో, ఈ పనిలో మాంచి పేరున్నది. ఆయన్ను గుర్రపు సారట్‌మీద తీసుకుపోయేవారుట. 'మేమ్‌సాబ్'లు తెర వెనుక ఉండి చేతులు మాత్రం ముందుకు చాపేవారుట. ఆ చేతుల్ని చూస్తూనే వారికి ఏ రకం గాజులు బాగా నప్పుతాయో ఆ చేతుల 'ఆది' ఎంతో మా తాతగారు తెలుసుకునేవారుట. గాజుల తయారీని బట్టి, ప్రభువుల స్థాయిని బట్టి వారి సరదాలను బట్టి మజూరీ తీసుకునేవారట మాత తాతగారు. ఆయన తయారు చేసిన కొన్ని వందల జతల గాజుల్లో ఏ రెండు జతలకూ 'పోలికనే' ఉండేవి కావని మా నాన్న చెబుతుండే వారండి!" అన్నాడు భిక్షపతి.

మహా ఘనత వహించిన నిజాం ప్రభువుల జనాలకు కావలసిన అందచందాల గాజులను సరఫరా చేసేవారిలో భిక్షాలు తాతగారు ప్రముఖులు. ఒకసారి బరోడా గాయక్వాడ్ గారి కోరిక మేరకే నిజాం ప్రభువులు వందల జతల గాజుల్ని వెండి పెట్టెల్లో అమర్చి ప్రత్యేక దూత ద్వారా బరోడా మహారాజుగారికి కానుకగా పంపించారు. ఆ వందల జతల గాజుల్లోనూ రవ్వలు పొదిగినవి రెండు

జతలున్నాయట. ఆ రెండు జతల్ని, పెద్ద భిక్షాలు తయారు చేశాడని మన భిక్షాలు చెప్పాడు.

"దక్షిణ భారత దేశంలో రకరకాల గాజుల్ని, రంగురంగుల గాజుల్ని తయారు చేయడానికి హైదరాబాదును మించింది లేదండి. వంశ పారంపర్యంగా ఈ వృత్తినే నమ్ముకున్న కుటుంబాలు ఇక్కడ చాలా ఉన్నాయి. ఒకప్పుడు ఎంతో హాయిగా వీళ్ళందరూ ఉండేవారు. ఇప్పటిసంగతి అడక్కండి" అన్నాడు భిక్షాలు.

తయారు చేసేవారి సంఖ్య పెరిగింది. డిజైన్లు పెరిగాయి. ఉత్పత్తులుపెరిగాయి. అయినా పనివారి పరిస్థితులు బొత్తిగా బాగా లేవు. దానిక్కారణం భిక్షపతి చెప్పిందే కావచ్చు. ఇదివరకు రోజుల్లో తయారు చేసినవారే, నేరుగా కొనుగోలు దార్లకు అమ్ముతుండేవారు. ఇప్పుడేమో మధ్య వర్తులు వచ్చారు. ఈ దళారీలు పనివారికి పెట్టుబడి పెడతారు. ఖాతాదారులక్కావలసిన విధంగా గాజుల్ని తయారు చేయిస్తారు. పనివారికి కూలీ డబ్బులిచ్చి మిగిలిన లాభాలన్నీ తామే మింగేస్తారు.

"కూలీ కూడా బాబు!" అని ప్రారంభించాడు భిక్షపతి. "ఒక రకంగా ఉండదండి, గాజు డిజైన్నుబట్టి, దానిమీద పొదిగే రాళ్ళ సంఖ్యను బట్టి ఉంటుంది. ఒక్కోజతు ఐదు రూపాయల్నుంచి యాభై రూపాయల దాకా ఛార్జి వేస్తాను. ఐదు రూపాయల జతలు రోజుకు రెండు మూడు జతలు చేస్తే యాభై రూపాయలు జతచేయడానికి, కనీసం మూడు రోజులన్నాపడుతుంది" అన్నాడు భిక్షపతి.

అతని భార్య లక్కను మెత్తబరచి, తీగెలుగా సాగదీస్తున్నది. పెద్ద కొడుకు అచ్చులో దాన్నుంచి, రూళ్లకర్రలాంటి దానితో, ఆ లక్కతీగెను, అచ్చులోకి నొక్కుతున్నాడు.

"దాన్ని తీశాక, ఆదికి మడుస్తాం. లక్క చిట్లిపోకుండా అల్యూమినం రింగులుగానీ, రాగిరింగులుగానీ అమర్చుతాం. రకరకాల రాళ్ళను, అద్దం పలుకుల్ని జాగ్రత్తగా అతుకుతాం" అన్నాడు భిక్షపతి.

ఇక్కడ తయారైన గాజులు, దేశం మొత్తానికి రవాణా అవుతాయట. విదేశీయులు ఇక్కడికొచ్చినప్పుడు తప్పకుండా వీటిని కొంటారట.

"వాళ్ళను ఈ వ్యాపారస్తులు మరీ ఘోరంగా మోసం చేస్తున్నారండీ. మామూలుగా పది పదిహేను రూపాయలుండే జత గాజుల్ని, తెల్లముఖం కనిపించగానే యాభయ్‌లు, అరవయ్‌లు చెప్పి వారికి అంటగడుతుంటారు" అని విచారించాడు భిక్షపతి.

ఈ గాజులు ఇతర దేశాలకు ఎగుమతి అవుతున్నదీ లేనిదీ తనకు తెలియదన్నాడు భిక్షపతి.

అతనికి ముగ్గురు పిల్లలు. భార్య. పెద్ద పిల్లలిద్దరూ అతనికి పనిలో సాయపడుతుంటారు. ఇంతవరకూ, సొంత భూమిగానీ, చారెడు ఇల్లుగానీ లేని భిక్షపతి "పెట్టను కొట్ట - పొయ్‌లో పెట్ట"గా బతుకుతున్నానన్నాడు.

చిత్రమేమిటంటే పాతికేళ్ళుగా వేలకొద్దీ గాజుల జతల్ని తయారు చేసిన భిక్షపతి భార్య చేతికి, రంగుల గాజులు లేవు సరిగదా, మామూలు గాజులుకూడా లేవు. చేతికి కాశీతోరం కట్టుకుని ఉంది. తయారైన గాజులమ్ముకొని, ఆ డబ్బుతో నూకలు తెచ్చుకోవలసిన కర్మం భిక్షపతికి తప్పినదాకా, అతని భార్య చేతికి ఏ గాజులూ వచ్చే అవకాశం లేదు.